
andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
శనివారం ఉష్ణోగ్రత గరిష్టం 39.8 కనిష్టం 27.6



2న సైబర్‌క్రైమ్ పోలీసు స్టేషన్ ప్రారంభం

ఖిల్లా, మార్చి 30: జిల్లాలో సైబర్‌క్రైమ్ నేరాలను తగ్గించేందుకు పోలీసు శాఖ ఏప్రిల్ 2న జిల్లాకేంద్రంలో సైబర్‌క్రైమ్ పోలీసుస్టేషన్‌ను ప్రారంభించనున్నట్లు పోలీసు కమీషనర్ కల్మేశ్వర్ శింగనేవార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బాధితులు, రూ.లక్షపై బడి సైబర్ నేరాల బారిన పడిన వారు సైబర్‌క్రైమ్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తామని తెలిపారు. లక్ష రూపాయలకు తక్కువగా ఉన్నవారు మాత్రం సంబంధిత పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

- సభలు, సమావేశాలపై కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ దృష్టి
- పార్టీ నేతలతో సమన్వయ సమావేశాలు
- వలసలను ప్రోత్సహిస్తున్న కాంగ్రెస్, బీజేపీ నేతలు
- ఏప్రిల్‌లో భారీ బహిరంగ సభలు, రోడ్‌షోలకు అభ్యర్థుల ఏర్పాట్లు



మొదలైన పార్లమెంటు
ఎన్నికల పోరు!


నిజామాబాద్, మార్చి30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పార్లమెంట్ ఎన్నికల పోరు మొదలైంది. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ అభ్యర్థులు ప్రచారాలపై దృష్టి పెట్టారు. నియోజకవర్గాల్లో సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. రోడ్డు ప్రచారాలకన్న భిన్నంగా మండలస్థాయిలో సమన్వయ సమావేశాలను నిర్వహిస్తున్నారు. ఇతర పార్టీల నేతలను పార్టీలో చేర్చుకోవడంతో పాటు ఈ ఎన్నికల్లో సహకరించాలని అభ్యర్థులు కోరుతున్నారు. సామాజికవర్గాల ఆధారంగా సంఘాలు, వృత్తి సంఘాలతో సమావేశాలను నిర్వహిస్తున్నారు. తమకు సహకరించి గెలిపిస్తే వారికి కావాల్సిన పనులన్నీ చేసి పెడతామని అభ్యర్థులు హామీ ఇస్తూ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ ముందే అన్ని నియోజకవర్గాల పరిధిలో సమన్వయ సమావేశాలు నిర్వహించిన తర్వాత భారీ బహిరంగ సభలను నియోజకవర్గాల వారిగా నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. పార్టీకి చెందిన జూనియర్ నుంచి సీనియర్ నేతల వరకు కలుపుకొని ముందుకు వెళ్లేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈ ఎన్నిక మూడుపార్టీలకు కూడా తప్పనిసరి కావడంతో గెలుపుకోసం పూర్తిస్థాయిలో ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. ఓటర్ల మద్దతును కూడగట్టేందుకు సిద్ధమవుతున్నారు.

అభ్యర్థుల సుడిగాలి పర్యటనలు

కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ అభ్యర్థులను ప్రకటించడంతో నేతలు ప్రచారంపై దృష్టిపెట్టారు. పార్లమెంట్ పరిధిలో మూడుపార్టీల అభ్యర్థులు సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. ఆయా నియోజకవర్గాల్లో మండల సమావేశాలను నిర్వహి స్తున్నారు. ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జీలు, మండలపార్టీ నేతలు, పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు హాజరయ్యేలా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ ఎన్నికల్లో తమకు సహకరించాలని అభ్యర్థులు కోరుతున్నారు. మండల సమావేశాల్లోనే ఆయా నేతలతో సమన్వయ కమిటీలను ఏర్పాటు చేస్తున్నారు. అసంతృప్తిలో ఉన్న నేతలను బుజ్జగిస్తూనే పూర్తిస్థాయిలో ప్రచారం చేస్తున్నారు. మూడుపార్టీల అభ్యర్థులు ప్రధానంగా సామాజికవర్గాలపై దృష్టిపెట్టి ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. ముందుగా ఓటర్లు ఎక్కువగా ఉన్నకుల సంఘాలపై దృష్టిపెట్టి వారితో ప్రత్యేక సమావేశాలను నిర్వహిస్తున్నారు. తమను గెలిపిస్తే వారికి ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామని చెప్తున్నారు. వివిధవర్గాలతో పాటు ఆయా యూనియన్‌లను కూడా కలుస్తూ అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు తమ ప్రభుత్వాలు చేపడుతున్న కార్యక్రమాలను వివరిస్తూ సహకరించాలని కోరుతున్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి పదేళ్లలోచేసిన అభివృద్ధితోపాటు ప్రజల పక్షాన ఉంటా మని తమకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు.

దూకుడును పెంచుతున్న కాంగ్రెస్

సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష తర్వాత కాంగ్రెస్ నేతలు ప్రచార దూకుడును పెంచుతున్నారు. పార్లమెంట్ సన్నాహక సమావేశాన్ని నిర్వహించడంతో పాటు అన్ని నియోజకవర్గాల్లో నేతలందరూ పాల్గొనేలా సన్నద్ధమవుతున్నారు. పార్టీ అభ్యర్థి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని ఎట్టి పరిస్థితుల్లో గెలిపించాలని నిజామాబాద్, జగిత్యాల జిల్లాల ఎమ్మెల్యేలతోపాటు ఎమ్మెల్సీలు, కార్పొరేషన్‌చైర్మన్లు, జిల్లా అధ్యక్షుడు, సీనియర్ నేతలపై సీఎం రేవంత్‌రెడ్డి పెట్టడంతో పూర్తిస్థాయిలో ప్రచారంలో నిమగ్నమయ్యేందుకు సిద్ధమవుతున్నారు. మండల, నియోజకవర్గస్థాయిలో ప్రత్యేక సమావేశాలు నిర్వహించడంతోపాటు పూర్తిస్థాయిలో బహిరంగ సభలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇతర పార్టీల నుంచి జోరుగా వలసలను ప్రోత్సహిస్తున్నారు. ముఖ్యంగా బీఆర్‌ఎస్‌కు చెందిన ప్రజాప్రతినిధులు, మాజీ నేతలను ఎక్కువగా చేర్చుకుంటున్నారు. పార్టీ బలోపేతంపై దృష్టి పెట్టడంతోపాటు ఎన్నికల్లో ఉపయోగపడేలా ప్రయత్నాల ను చేస్తున్నారు. సహకార సంఘాల చైర్మన్లను, డైరెక్టర్లను చేర్చుకోవడంతో పాటు మరింత బలాన్ని పెంచుకునేందుకు సిద్ధమవుతున్నారు. గత శాసనసభ ఎన్నికల్లో పార్లమెంట్ పరిధిలో ఇద్దరు ఎమ్మెల్యేలు గెలవడంతోమిగతా నియోజకవర్గాల్లో వలసలపై దృష్టిపెట్టి పనిచేస్తున్నారు. భారీ బహిరంగ సభలను ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతున్నారు.



బీజేపీ సమన్వయ సమావేశాలు

బీజేపీ నేతలు ప్రచారంలో ముందుంటున్నారు. ఎంపీ అభ్యర్థిగా అరవింద్‌ను ముందే ప్రకటించడంతో ఆయన నియోజకవర్గాల్లో పూర్తిస్థాయిలో ప్రచారంలో నిమగ్నమయ్యారు. జగిత్యాలలో 15రోజుల క్రితం ప్రధాని మోదీ సభను నిర్వహించిన ఆయన అన్నిమండలాల్లో సమన్వయ సమావేశాలను నిర్వహిస్తున్నారు. కొన్నిమండలాల పరిధిలో రోడ్‌షోలను కూడా నిర్వహిస్తూ ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. పార్టీకి చెందిన నేతలందరూ పాల్గొనే విధంగా చూస్తూనే పూర్తిస్థాయి ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. మిగతా అభ్యర్థులకన్న ముందు ప్రకటించడంతో అన్నినియోజకవర్గాల పరిధిలో ఇప్పటికే పర్యటించిన ఆయన మరింత దూకుడుగా ప్రచారాన్ని చేసేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. పార్టీకి చెందిన సీనియర్ నేతలను తీసుకువచ్చి నియోజ కవర్గాల వారిగా భారీ బహిరంగ సభలను నిర్వహించేందుకు ఏర్పాట్లను చేసుకుంటున్నారు. పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో పార్టీనేతలు పాల్గొనడంతోపాటు అసంతృప్తులను బుజ్జగిస్తూ పాల్గొనేలా చూస్తున్నారు. ఇతర పార్టీ నేతలను చేర్చుకుంటూ ముందుకు పోయే విధంగా ఏర్పాట్లను కొనసాగిస్తున్నారు.

బీఆర్‌ఎస్ నేలతో కలిసి బాజిరెడ్డి ప్రచారం

బీఆర్‌ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ కూడా నియోజకవర్గాల్లో పర్యటిస్తున్నారు. ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలతో కలిసి ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. మండలస్థాయిలో సమన్వయ సమావేశాలను నిర్వహిస్తున్నారు. వివిధ సంఘాలతో చర్చలు జరుపుతూనే నిత్యం పలు కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఆర్మూర్, కొరుట్ల, జగిత్యాల, బాల్కొండ నియోజకవర్గాల పరిధిలో ప్రత్యేక సమావేశాలను నిర్వహించిన ఆయన మిగతా నియోజకవర్గాల్లో కూడా పూర్తి స్థాయిలో ప్రచారం చేసేందుకు ఏర్పాట్లను చేసుకుంటున్నారు. జిల్లాస్థాయిలో ఈనెల 1న పార్లమెంట్‌స్థాయి సమావేశాన్ని నిర్వహించడంతో పాటు నోటిఫికేషన్ వరకు అన్ని మండలాల్లో సభలు, సమావేశాలు నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్నారు. పూర్తిస్థాయిలో ప్రచారాన్ని ప్రారంభించిన ఆయన వివిధ వర్గాల మద్దతును కూడగట్టే ప్రయత్నాలను చేస్తున్నారు. ఎన్నికలకు సమయం దగ్గర పడుతుండటంతో అన్నినియోజకవర్గాల్లో బహిరంగ సభలు నిర్వహించేందుకు ఏర్పాట్లను చేస్తున్నారు.

భారీ బహిరంగ సభలకు ఏర్పాట్లు

మూడు పార్టీల నేతల మధ్య ఎన్నికల పోరు మొదలైంది. ఎండలు పెరుగుతున్నా అభ్యర్థులు మాత్రం సుడిగాలి పర్యటనలు జరుపుతూ ప్రచారాలను దూసుకుపోతున్నారు. మొదట మండలస్థాయిలో సమన్వయ సమావేశాలు నిర్వహించి రోడ్‌షోలు, బహిరంగ సభలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. ఏప్రిల్ నెలలో పూర్తిస్థాయిలో భారీ ప్రచారాలను నిర్వహించేందుకు మూడు పార్టీల నేతలు సన్నద్ధం అవుతున్నారు. ఏప్రిల్ నెలంతా అభ్యర్థుల ప్రచారాలతో నామినేషన్‌లతో బిజీ బిజీగా ఉండే అవకాశం ఉంది.

అనుమతి లేని పాఠశాలలపై చర్యలకు డీఈవో ఆదేశం

నిజామాబాద్‌అర్బన్, మార్చి 30: పలు విద్యార్థి సంఘాల ఫిర్యాదుల మేరకు అనుమతి లేని పాఠశాలలపై చర్యలకు డీఈవో ఎన్‌వీ దుర్గాప్రసాద్ ఆదేశాలు జారీచేశారు. నిజామాబాద్ నగరంతోపాటు డిచ్‌పల్లి మండల పరిధిలోని పలుప్రైవేటు పాఠశాలలకు ఎలాంటి అనుమతులు లేకుండానే అడ్మిష న్లు ప్రారంభించారని అలాంటి పాఠశాలలపై విచారణ జరిపి తదుపరి చర్యలు తీసుకోవాలని మండల విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. నగరంలోని నిశిత ఇంటర్నేషనల్ పాఠశాల, హెచ్‌పీఎస్ పాఠశాల, ప్రెసిడెన్సీపాఠశాల, మాధవనగర్ వద్దగల వెక్టర్ స్కూళ్లకు ఇంకా ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతి రాలేదని, ఆ పాఠశాలల్లో తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించవద్దని ఆయన వెల్లడించారు.

రంజాన్ వేళలు

ఆదివారం	సోమవారం
ఇఫ్తార్ : సా. 6.34	సహర్ : ఉ. 4.48



అసత్యం, అధర్మ కార్యాలను వదలకుండా అన్నపానీయాలు వదిలేసి ఉపవాస దీక్ష పాటించడం అల్లాహ్‌కు ఇష్టం ఉండదు



• ఇంటికి బయల్దేరుతున్న విద్యార్థులు



పదికి బైబై

- ముగిసిన పదోతరగతి పరీక్షలు
- ఇళ్లకు పయనమైన విద్యార్థులు

నిజామాబాద్ అర్బన్: జిల్లా వ్యాప్తంగా పదోతరగతి పరీక్షలు శనివారం ముగిసాయి. ఈనెల 18న ప్రారంభమైన పరీక్షలు శనివారంతో ముగియడంతో పదో తరగతికి బైబై అంటూ విద్యార్థులు ఉత్సాహంగా కనిపించారు. పరీక్షలు ముగిసిన అనంతరం పేపర్‌లు, ప్యాడ్‌లు గాల్లోకి ఎగిరేసి సంబరాలు చేసుకున్నారు. తమ మిత్రులతో కలిసి సెల్ఫీలు తీసుకొని మంచి చెడులు మాట్లాడుకున్నారు. పరీక్షలు ముగియడంతో విద్యార్థులు తమ సొంత ఊళ్లకు పయనమయ్యారు. దీంతో బస్టాండ్, రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో సందడిగా మారాయి. శనివారం నిర్వహించిన సోషల్ పరీక్షకు మొత్తం 21,908 మందికి గాను 21,869 మంది హాజరుకాగా 39 మంది గైర్హాజరయ్యారు. జిల్లావ్యాప్తంగా ఎక్కడ కూడా ఎలాంటి మాస్ కాపీయింగ్ కేసులు నమోదు కాలేదు. పరీక్షల నిర్వహణకు సహకరించిన సిబ్బంది డీఈవో దుర్గాప్రసాద్ ధన్యవాదాలు తెలియజేశారు.



అవిశ్వాసానికి హాజరైన కాంగ్రెస్, బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు

కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్‌పై
అవిశ్వాసం నెగ్గిన కాంగ్రెస్

- బలపరీక్షకు హాజరైన 37 మంది కౌన్సిలర్లు
- చైర్‌పర్సన్‌కు వ్యతిరేకంగా మెజార్టీ కౌన్సిలర్ల తీర్మానం
- కాంగ్రెస్‌కు మద్దతు తెలిపిన 10మంది బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు
- హైకోర్టులో పిటిషన్ వేసిన చైర్‌పర్సన్ జాహ్నవి

కామారెడ్డి టౌన్, మార్చి 30: కామారెడ్డి మున్సిపల్ కౌన్సిల్ పీఠాన్ని బీఆర్‌ఎస్ కోల్పోయింది. కౌన్సిల్‌చైర్‌పర్సన్ నిట్టుజాహ్నవిపై కాంగ్రెస్ పెట్టిన అవిశ్వాసం నెగ్గింది. దీంతో బీఆర్‌ఎస్ కామారెడ్డి మున్సిపాలిటిని కోల్పోవాల్సి వచ్చింది. మున్సిపల్ చైర్‌పర్సన్‌పై ఈనెల 11న కాంగ్రెస్ కౌన్సిల ర్లు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. దీంతో కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆధ్వర్యంలో మున్సిపల్ అధికారులు శనివారం చైర్‌పర్సన్‌పై పెట్టిన అవిశ్వాసంపై కౌన్సిలర్లలతో అధికారులు సమావేశాన్ని నిర్వహించి బలపరీక్షను ఏర్పాటు చేశారు. కామారెడ్డి మున్సిపల్ కౌన్సిల్‌లో మొత్తం 49మంది సభ్యులు ఉండగా అవిశ్వాసం నెగ్గాడానికి 34 మంది సభ్యులు అవసరం ఉంది. అయితే శనివారం జరిగిన బల పరీక్షకు 37 మంది సభ్యులు హాజరై తమ మద్దతును తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన 27 మంది కౌన్సిలర్‌లు, బీఆర్‌ఎస్‌కు చెందిన 10మంది కౌన్సిలర్లు మద్దతు తెలిపారు. జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్, మున్సిపల్ కమీషనర్ సుజాత ఆధ్వర్యంలో అవిశ్వాస తీర్మానంపై సమావేశం నిర్వహించారు. 37మంది కౌన్సిలర్‌లు మున్సిపల్ చైర్‌పర్సన్ నిట్టుజాహ్నవికి వ్యతిరేక ంగా చేతులెత్తి మద్దతు తెలిపారు. దీంతో కాంగ్రెస్ అవిశ్వాసం నెగ్గినట్లు అధికారులు ప్రకటించారు. అవిశ్వాస తీర్మానం అనంతరం మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఇందుప్రియ మా ట్లాడుతూ మున్సిపల్ చైర్‌పర్సన్‌పై నిట్టుజాహ్నవిపై 27మంది కాంగ్రెస్ కౌన్సిలర్‌లతో అవి శ్వాసం ప్రవేశపెట్టమని తెలిపారు. అయితే తనపై అవిశ్వాస తీర్మానంప్రవేశపెట్టడాన్ని నిరసిస్తూ నిట్టుజాహ్నవి హైకోర్టును ఆశ్రయించారు. ఈనెల 12న హైకోర్టులో తీర్పు రానుందని చైర్‌పర్సన్ వర్గీయులు చెప్తున్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి

నిజామాబాద్ పార్లమెంట్‌పై
కాంగ్రెస్ జెండా ఎగరాలి

- ప్రజల మనిషి జీవన్‌రెడ్డి పార్లమెంట్‌కు వెళ్లాలి
- బీజేపీ, బీఆర్‌ఎస్‌లకు బుద్ధి చెప్పాలి
- జీవన్‌రెడ్డి గెలిస్తే కేంద్ర మంత్రి ఖాయం
- పార్లమెంట్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో నేతలు
- హాజరైన సుదర్శన్‌రెడ్డి, షబ్బీర్‌అలీ, మహేష్‌గౌడ్, మధుగౌడ్, అడ్లూరి లక్ష్మణ్

నిజామాబాద్ అర్బన్, మార్చి30: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో నిజామాబాద్ పార్లమెంట్‌పై కాంగ్రెస్ జెండా ఎగరాలని, ప్రజల మనిషి జీవన్‌రెడ్డి పార్లమెంట్‌కు వెళ్లాల్సిన అవసరం ఉందని నేతలు పేర్కొన్నారు. శనివారం నగర శివారులోని బైపాస్‌రోడ్‌లో గల రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి కార్యాలయం వద్ద నిజామాబాద్ పార్లమెంట్ ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్‌అలీ, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కి తదితరులు హాజరై మాట్లాడారు. నిత్యంప్రజల్లో ఉంటూ అవినీతి మచ్చలేని జీవన్‌రెడ్డిని వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. జీవన్‌రెడ్డి ఎంపీగా గెలిస్తే కేంద్రంలో మంత్రి కావడం ఖాయమని సీనియర్ నేతగా జాతీయ స్థాయిలో మంచి పేరున్న నాయకుడు జీవన్‌రెడ్డి అన్నారు. గత పదేళ్లలో రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అన్ని వర్గాలను మోసం చేసిందని అందువల్లే ప్రజలు కేసీఆర్‌కు గుణపాఠం చెప్పారన్నారు. కాళేశ్వరం పేరుతో లక్షల కోట్లు ఖర్చు చేసి రెండు మూడుపిల్లర్లు కూలాయని మాట్లాడటం అవివేకమన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ హయాంలో నిర్మించిన ప్రాజెక్టులను బీఆర్‌ఎస్ నేతలు ఒకసారి వెళ్లి పరిశీలించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లోనే ఆరు గ్యారంటీలలో నాలుగు గ్యారంటీలను అమలు చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డిదన్నారు. 30వేల ఉద్యోగాలకు నియామక పత్రాలు ఇచ్చామని ఎక్కడ కూడా అవినీతికి ఆస్కారం లేకుండా పరిపాలన అందిస్తున్నామన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లోనూ జీవన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించి ప్రస్తుత ఎంపీ అరవింద్‌కు, బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డికి గుణపాఠం చెప్పాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ మేరకు బోధన్ షుగర్ ఫ్యాక్టరీని తెరిపించేందుకు కృషి చేస్తుందన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్, బీజేపీలు పార్లమెంట్ ఎన్నికల తర్వాత ఈ ప్రభుత్వాన్ని కూల్చేస్తామని ప్రకటనలు చేస్తున్నారని ముందు జాగ్రత్తగా ప్రజల ప్రభుత్వాన్ని కాపాడుకునేందుకు ఇతర పార్టీల ఎమ్మెల్యేలను, నాయకులను పార్టీలో చేర్చుకుంటున్నామని గత పదేళ్లుగా పార్టీ కోసం కష్టపడిన నాయకులు, కార్యకర్తలు ఎవరూ అధైర్యపడవద్దన్నారు. కచ్చితంగా పార్టీలో కష్టపడిన వారికి గుర్తింపు ఉంటుందన్నారు. తనకు నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా ఏకగ్రీవంగా ప్రకటించడంలో కృషి చేసిన నిజామాబాద్ జిల్లా నాయకులందరికి ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. దేశంలో ప్రస్తుతం కేంద్రంప్రభుత్వం మారే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని గత పదేళ్లుగా బీజేపీ ప్రభుత్వం రైతులను, అన్నివర్గాలను నిర్లక్ష్యం చేసిందని అన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో తనను గెలిపించాలని బాండ్ పేపర్‌తో మోసం చేసిన అరవింద్‌కు, బీఆర్‌ఎస్ అభ్యర్థి బాజిరెడ్డికి ప్రజలే గుణపాఠం చెప్పాలన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీలు ఆకుల లలిత, అరికెల నర్సారెడ్డి, మాజీ ఎమ్మెల్యే అనిల్, ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్‌బిన్ హుందాన్, జువ్వాడి నర్సింగ్‌రావు, అన్వేష్‌రెడ్డి, మానాల మోహన్‌రెడ్డి, కేశవేణు, వినయ్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, శేఖర్ గౌడ్,మాజీ మేయర్ ఆకుల సుజాత, ఆర్మూర్, జగిత్యాల మున్సిపల్ చైర్మన్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న నేతలు

• పార్టీలో చేరిన నేతలు

అర్బన్ ఇన్‌చార్జి షబ్బీర్‌అలీ, వర్కింగ్ ప్రసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్, ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి సమక్షంలో పలువురు నేతలు కాంగ్రెస్‌లో చేరారు. రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దయానంద్‌గుప్త, మాజీ కార్పొరేటర్ ఛాంగుబాయి, బాలరాజు, తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి మహేష్‌కుమార్‌గౌడ్ పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

నింబాచల క్షేత్రానికి పోటెత్తిన భక్తులు

భీమ్‌గల్ రూరల్, మార్చి 30: మండలంలోని లింబాద్రి గుట్టపై శ్రీనింబాచల లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకోవడానికి శనివారం భక్తులు పోటెత్తారు. ఉదయం 5గంటల నుంచి మండలం నుంచే కాకుండా వివిధ మండలాల నుంచి భక్తులు స్వామి వారిని దర్శించుకోవడానికి కాలినడకన గుట్టకు చేరుకున్నారు. క్యూలైన్‌లో నిల్చొని గర్భగుడిలోని స్వామి వారిని దర్శించుకున్నారు. గోవింద నామస్మరణలతో లింబాద్రిగుట్ట మార్మోగింది. నారికేళాలు కొట్టి మొక్కులు చెల్లించుకుని అన్నదానంలో పాల్గొన్నారు.

'ధాన్యాన్ని దళారులకు అమ్ముకోవద్దు'

సిరికొండ మార్చి 30: ఆరు గాలం కష్టించి పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్ముకుని నష్ట పోవద్దని డీఆర్‌డీవో పీడీ సాయగౌడ్ రైతులను కోరారు. సిరికొండ మండలంలో ఐకేపీ ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను పీడీ ప్రారంభించారు. సిరికొండ, పెద్దవాల్గోట్, కొండాపూర్,గడ్కోల్ తదితర గ్రామాల్లో కేంద్రాలను ప్రారంభించిన అనంతరం రైతులతో పీడీ మాట్లాడారు. గ్రామాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించుకోవాలని ఆయన కోరారు.

వాహనాల తనిఖీలో నగదు పట్టివేత

ఖిల్లా, మార్చి 30: నగరంలోని ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల కుమార్‌గల్లీ ప్రాంతంలో శనివారం పోలీసులు వాహనాల తనిఖీ చేస్తున్నారు. అయితే, అనుమానాస్పదంగా వెళ్తున్న ఒక వాహనాన్ని నిలిపి తనిఖీ చేస్తుండగా.. ఎటువంటి ఆధారులు లేకుండా రూ.4 లక్షల ఎనిమిది వేల నగదును పోలీసులు గుర్తించారు. ఆ డబ్బును ఎటువంటి ఆధారాలు చూపకపోవడంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్యల కోసం ఆదాయ పన్నులశాఖ అధికారులకు అప్పగించారని ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో డి.విజయబాబు తెలిపారు. డబ్బులు తరలిస్తున్న వ్యక్తి శివప్రసాద్ అనే వ్యక్తి ఫైనాన్స్ వ్యాపారం చేస్తున్నట్టు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

టీవీ, సోషల్ మీడియా చానళ్లలో తప్పుడు ప్రచారం

» 10 సంస్థలకు నోటీసులు పంపా: కేటీఆర్

హైదరాబాద్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): కొన్ని టీవీ చానళ్లతోపాటు, యూట్యూబ్, సోషల్ మీడియా సంస్థలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ లీగల్ నోటీస్‌లు పంపించారు. ఇప్పటికే పలు చానళ్లకు లీగల్ నోటీస్‌లు పంపిన కేటీఆర్.. శనివారం మరో 10 సంస్థలకు లీగల్ నోటీస్‌లు పంపించారు. తనను, తన కుటుంబాన్ని బద్నాం చేయాలనే కుట్రలో భాగంగా అసత్య ప్రచారాలు, కట్టు కథలు అల్లుతున్నాయని, అందుకే ఆయా మీడియా సంస్థలకు నోటీసులు పంపినట్లు కేటీఆర్ వెల్లడించారు. మీడియా ముసుగులో అవన్నీ కుట్ర చేస్తున్నాయని ఆయన ఆరోపించారు. అయితే ఇప్పటికే కొన్ని మీడియా సంస్థలు తప్పు తెలుసుకుని వీడియోలు తీసివేసినట్లు తనకు సమాచారం అందించాయన్నారు. వారంలోగా మిగతా చానళ్లు కూడా తీసివేయాలని, లేదంటే వాటిపై చట్టప్రకారం ముందుకెళ్తామని శనివారం కేటీఆర్ ఒక ప్రకటనలో తెలిపారు.

కేసీఆర్ అవినీతిపై సమగ్ర విచారణ జరపాలి

» విదేశాలకు పారిపోకుండా పాస్‌పోర్టును సీజ్ చేయాలి

» హుస్నాబాద్ పోలీస్‌స్టేషన్‌లో జేఏసీ ఫిర్యాదు

హుస్నాబాద్, మార్చి 30: బీఆర్ఎస్ పది సంవత్సరాల పాలనలో మాజీ సీఎం కేసీఆర్ చేసిన అవినీతిపై సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని శనివారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పోలీస్ స్టేషన్‌లో నియోజకవర్గ జేఏసీ నాయకులు ఫిర్యాదు చేశారు. అవినీతికి పాల్పడిన కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, కవిత, సంతోష్‌రావు విదేశాలకు పారిపోకుండా వారి పాస్‌పోర్టులు సీజ్ చేయాలని కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, సచివాలయనిర్మాణం, వరంగల్ జైలు కూల్చివేత, గొర్ల పంపిణీ, దళిత బంధు, ప్రైవేట్ విశ్వవిద్యాలయాలకు అనుమతులు, ధరణి పేరిట భూ కబ్జాలు తదితర అంశాలపై రూ.లక్షల కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించారు.

ఏళ్లు గడిచినా గుర్తింపు లేదని..

» సీఎం నివాసం వద్ద కాంగ్రెస్ కార్యకర్త ఆత్మహత్యాయత్నం

బంజారాహిల్స్, మార్చి 30, (ఆంధ్రజ్యోతి): పార్టీలో చేరి సంవత్సరాలు గడుస్తున్నా తనకు తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదని ఓ కాంగ్రెస్ కార్యకర్త సీఎం నివాసం వద్ద ఆత్మహత్యాయత్నం చేశాడు. వరంగల్ జిల్లా భూపాలపల్లికి చెందిన కృష్ణ సాగర్ నగరంలోని రాజీవ్‌నగర్‌లో నివాసం ఉంటూ వ్యాపారం చేస్తున్నాడు. కాంగ్రెస్ కార్యకర్తగానూ వ్యవహరిస్తున్నాడు. జూబ్లీహిల్స్‌లోని సీఎం రేవంత్ రెడ్డి నివాసం వద్దకు శనివారం కారులో వచ్చాడు. సీఎంను కలిసేందుకు ప్రయత్నించగా భద్రతా సిబ్బంది వారించారు. దీంతో కృష్ణ సాగర్ తనతో తెచ్చుకున్న డీజిల్ పోసుకొని నిప్పు అంటించుకుంటానంటూ బెదిరించాడు. అక్కడే ఉన్న పోలీసులు స్పందించి జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కృష్ణసాగర్ మాట్లాడుతూ తాను సీఎం రేవంత్‌తోపాటు టీడీపీ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చినట్టు చెప్పాడు. పార్టీలో ఏళ్లుగా పనిచేస్తున్నా గుర్తింపు లేదని ఆవేదన వ్యక్తం చేశాడు.

జూన్ 1 నుంచి ఇంటర్ కాలేజీల ప్రారంభం

హైదరాబాద్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): వచ్చే విద్యాసంవత్సరానికి (2024-25) సంబంధించిన అకడెమిక్ క్యాలండర్‌ను ఇంటర్ బోర్డు శనివారం ప్రకటించింది. దీనిప్రకారం జూన్ 1 నుంచి కొత్త విద్యాసంవత్సరం తరగతులు ప్రారంభమవుతాయి. నవంబరు 18 నుంచి అర్ధ సంవత్సర పరీక్షలు, 2025 జనవరి 20 నుంచి ప్రీఫైనల్, ఫిబ్రవరి మొదటివారంలో ప్రాక్టికల్ పరీక్షలు, మార్చి మొదటివారంలో వార్షిక పరీక్షలు ఉంటాయని బోర్డు తెలిపింది.

పోలీస్ టు పొలిటికల్

(మొదటి పేజీ తరువాయి)

మలుపు తిరిగింది. "సాధారణంగా టాస్క్‌ఫోర్స్ బృందాలు, స్పెషల్ ఆపరేషన్ బృందాలు ఎన్నికల సమయంలో సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ బూత్‌లపై దృష్టిపెడతాయి. స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ పేరుతో ఈ బృందాలు తమకు వచ్చిన సమాచారం మేరకు ఏ నియోజకవర్గంలోనైనా పర్యటిస్తాయి. అనుమానితులను సోదా చేస్తాయి. వీరి వాహనాలను ఇతర తనిఖీ బృందాలు అడ్డగించవు" అని ఓ విశ్రాంత పోలీసు అధికారి వివరించారు. దీన్ని బట్టి రాధాకిషన్‌రావు తమకు ఉన్న అధికారాలను, వెసులుబాట్లను దుర్వినియోగం చేసి, డబ్బు తరలించి ఉంటారని దర్యాప్తు అధికారులు అంచనాకు వచ్చారు. ఎవరి కోసం డబ్బు తరలించారు? ఎవరికి అందజేశారు? అనే ప్రశ్నలకు రాధాకిషన్‌రావు నోరు విప్పితే.. రాజకీయ నాయకుల పాత్ర బయటకు వస్తుందని తెలుస్తోంది. ప్రస్తుతం జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న రాధాకిషన్‌రావును కోర్టు అనుమతితో కస్టడీకి తీసుకుని, విచారించేందుకు పంజాగుట్ట పోలీసులు సిద్ధమవుతున్నారు. ట్యాపింగ్‌తోపాటు.. నగదు తరలింపు వెనక ఉన్న రాజకీయ శక్తులెవరనేది రాధాకిషన్ విచారణలో తేలుతుందని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. రాధాకిషన్‌ను ఏయే అంశాలపై ప్రశ్నించాలి? అనే దానిపై ఉన్నతాధికారుల బృందం ఇప్పటికే ఓ ప్రశ్నావళిని సిద్ధం చేసినట్లు సమాచారం. "పోలీసు వాహనాల్లో డబ్బులు తరలించాలని ఆదేశించిన నాయ



కులెవరు? ఎన్నిసార్లు నగదును తరలించారు? ఎక్కడి నుంచి ఎక్కడికి చేరవేశారు? ఎవరికి అందజేశారు? ఆ నగదును ఎక్కడి నుంచి సర్దుబాటు చేశారు? ఈ కుట్రలో ఇంకా ఎవరెవరికి భాగస్వామ్యం ఉంది?" అనే ప్రశ్నలకు రాధాకిషన్ నుంచి సమాధానాలు రాబట్టేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. ఈ ప్రశ్నలకు రాధాకిషన్‌రావు నోరు తెరిస్తే.. గత ప్రభుత్వ పెద్దలు, బీఆర్ఎస్ ముఖ్య నాయకులు అరెస్టయ్యే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. అంతేకాదు.. మనీలాండరింగ్ కోణం ఉండడంతో.. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) కూడా రంగంలోకి దిగే సూచనలున్నాయి. కాగా, ఈ కేసులో మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావుది తొలి అరెస్టు కాగా.. ఆయనను అదే రోజు సస్పెండ్ చేశారు. అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్న కూడా 48 గంటలకు మించి జైలులో ఉన్న నేపథ్యంలో నిబంధనల ప్రకారం వారిని సస్పెండ్ అయినట్లే..! అయితే.. సోమవారం అధికారికంగా సస్పెన్షన్ ఉత్తర్వులు వెలువడతాయని డీజీపీ కార్యాలయ వర్గాలు తెలిపాయి.

చంచల్‌గూడ జైలుపై నిరంతర నిఘా..!

ఫోన్ ట్యాపింగ్ సంచలన కేసు కావడంతో.. నిందితులు జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న చంచల్‌గూడ జైలుపై ఉన్నతాధికారులు నిఘా పెంచారు. ప్రస్తుతం భుజంగరావు, తిరుపతన్న పోలీసు కస్టడీలో ఉండగా.. ప్రణీత్‌రావు, రాధాకిషన్‌రావు జైలులో ఉన్న విషయం తెలిసిందే..! దీంతో వారి బ్యారెక్‌లు, కదలికలు, ములాఖత్‌కు వస్తున్నవారిపై ఉన్నతాధికారులు నిఘా పెంచారు. ఎస్ఐబీ నుంచి డీఎస్పీ స్థాయి నేతృత్వంలోని ఓ బృందం ఈ నిఘాను పర్యవేక్షిస్తోంది.

అదుపులో ముగ్గురు ఇన్‌స్పెక్టర్లు..?

ఈ కేసులో ఇప్పటి వరకు ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు, టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ(ఓఎస్‌డీ) రాధాకిషన్‌రావు, మాజీ అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్న, మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు, ఐ న్యూస్ ఎండీ శ్రవణ్‌రావు నిందితులుగా ఉన్న విషయం తెలిసిందే! వీరితోపాటు.. ఐదుగురు ఇన్‌స్పెక్టర్లు కూడా పాత్రధారులేనని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. ఈ ఐదుగురిలో ఇద్దరు ఇప్పటికే విచారణకు హాజరయ్యారు. తాజాగా.. మరో ముగ్గురు ఇన్‌స్పెక్టర్లను అదుపులోకి తీసుకుని, బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో విచారిస్తున్నట్లు తెలిసింది. వీరు గతంలో ఎస్ఐబీలో పనిచేశారా..? లేక టాస్క్‌ఫోర్స్‌లో రాధాకిషన్ టీమ్‌లో పనిచేశారా..? ఫోన్‌ట్యాపింగ్‌తో నేరుగా సంబంధం ఉందా? లేక రాధాకిషన్‌రావు ఆదేశాలతో వ్యాపారుల ప్రొఫైల్స్ తయారు చేసి, అక్రమ వసూళ్ల దందాకు పాల్పడ్డారా? అనే వివరాలు తెలియాల్సి ఉంది. మరోవైపు.. భుజంగరావు, తిరుపతన్న కింద పనిచేసిన సిబ్బందిపైనా అధికారులు ఆరా తీస్తున్నారు.

కేకేకు బీఆర్ఎస్ ఏం అన్యాయం చేసింది?

» ఆయనకు రెండుసార్లు రాజ్యసభ.. కూతురికి మేయర్ పదవి ఇచ్చాం

» కష్టకాలంలో పార్టీని వీడడం దురదృష్టకరం

» కాంగ్రెస్ పాలనలో అందరికీ అన్యాయం

» ఆరు నెలల్లో అధికారం బీఆర్ఎస్‌దే: హరీశ్



గజ్వేల్, మార్చి 30: "బీఆర్ఎస్ కేశవరావు(కేకే)కు రెండుసార్లు రాజ్యసభ ఎంపీగా అవకాశమిచ్చింది. ఆయన కూతురికి మేయర్ పదవి.. కొడుక్కి కార్పొరేషన్ చైర్మన్ పదవులు కూడా ఇచ్చింది. పార్టీలో పెద్ద మనిషిగా కేకేకు కేసీఆర్ ఎప్పుడూ గౌరవం ఇచ్చే వారు. కేసీఆర్ ఆయనకు ఏం అన్యాయం చేశారు? కష్టకాలంలో పార్టీని వదిలిపోవడం దురదృష్టకరం" అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రశ్నించారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం శనివారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేటలోని ఓ గెస్ట్‌హౌజ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. పార్టీ కష్టకాలంలో ఉండగా విడిచి పెట్టి వెళ్లిన వాళ్లను తర్వాత కాళ్లు మొక్కినా తీసుకోబోమని చెప్పారు. తమకు నష్టం చేసిన వారిని విడిచి పెట్టేది లేదని, లెక్కలు రాస్తున్నామని, తర్వాత వడ్డీతో సహా తీర్చుకుంటామన్నారు. రాష్ట్రంలో వంద రోజుల కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఆగమయ్యారని, కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నీటి బుడగలు అని, ఉద్దెర పథకాలు మొదలు పెట్టారని ఎద్దేవా చేశారు. మళ్లా బోర్లు వేసే కాలం వచ్చిందని, మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయని, ఆరు నెలలు ఓపిక పడితే భవిష్యత్తు బీఆర్ఎస్‌దేనని, మళ్లీ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని చెప్పారు. గజ్వేల్ అభివృద్ధిని ఓర్వలేని బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌కు ఎందుకు ఓట్లు వేయాలని ప్రశ్నించారు. గజ్వేల్ అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నం చేసిన రఘునందన్ గురుంచి గ్రామాల్లో చర్చ పెట్టాలని హరీశ్‌రావు సూచించారు.

అందరికీ పనులు చేశా

తాను మంత్రిగా ఉన్నప్పుడు అందరికీ అన్ని పనులు చేశానని, సమయాభావం వల్ల కడుపు నిండా మాట్లాడలేకపోయానని, ఇక నుంచి నా ప్రాణం అడ్డం పెట్టి అయినా కార్యకర్తల వెంట ఉంటానని హరీశ్‌రావు అన్నారు. ఏప్రిల్ 2న పూర్తిస్థాయిలో కార్యకర్తల సమావేశం నిర్వహించి మాట్లాడుకుందామని చెప్పారు.

కామారెడ్డి మునిసిపాలిటీలో నెగ్గిన అవిశ్వాసం

» చైర్‌పర్సన్ పదవిని కోల్పోయిన జాహ్నవి

» వనపర్తిలో హైడ్రామా..

బీఆర్ఎస్‌కు 8 మంది రాజీనామా

కామారెడ్డి/మహబూబ్‌నగర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కామారెడ్డి మునిసిపల్ కౌన్సిల్ పీఠాన్ని బీఆర్ఎస్ కోల్పోయింది. మునిసిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవిపై కాంగ్రెస్ కౌన్సిలర్లు ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానానికి 10 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు కూడా మద్దతు తెలిపారు. దీంతో బీఆర్ఎస్ పార్టీ.. కామారెడ్డి మున్సిపాలిటీని కోల్పోవాల్సి వచ్చింది. కామారెడ్డి మునిసిపల్ చైర్‌పర్సన్‌పై ఈనెల 11 న కాంగ్రెస్ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. దీంతో అధికారులు శనివారం బలపరీక్ష సమావేశం నిర్వహించారు. కామారెడ్డి మున్సిపల్ కౌన్సిల్‌లో మొత్తం 49 మంది సభ్యులు ఉండగా.. అవిశ్వాసం నెగ్గడానికి 34 మంది సభ్యుల అవసరం ఉంది. అయితే, శనివారం జరిగిన బలపరీక్షకు కాంగ్రెస్ పార్టీకి చెందిన 27 మంది కౌన్సిలర్లు, బీఆర్ఎస్‌కు చెందిన 10 మంది కౌన్సిలర్లు హాజరై అవిశ్వాసానికి మద్దతు తెలిపారు. దీంతో కాంగ్రెస్ అవిశ్వాస తీర్మానం నెగ్గిందని అధికారులు ప్రకటించారు. కాగా, కాంగ్రెస్ కౌన్సిలర్లు తనపై అవిశ్వాస తీర్మానం చెల్లుబాటు కాదని పేర్కొంటూ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవి హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై ఈనెల 12న తీర్పు వెలువడే అవకాశం ఉందని పేర్కొన్నారు. మరోవైపు వనపర్తి మునిసిపాలిటీలో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డికి షాక్ తగిలింది. కౌన్సిలర్లు ఎవరూ పార్టీని వీడొద్దన్న ఉద్దేశంతో చైర్మన్ గట్టు యాదవ్, వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్‌తో ఆయన రాజీనామా చేయించిన విషయం తెలిసిందే. అయితే, శనివారం 8 మంది కౌన్సిలర్లు బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి, కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు ప్రకటించారు. గత మునిసిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున ఐదుగురు సభ్యులు గెలువగా, ఆ తర్వాత బీజేపీ నుంచి ఇద్దరు, బీఆర్ఎస్ నుంచి ఇద్దరు ఆ పార్టీలో చేరారు. టీడీపీకి ఒక కౌన్సిలర్ ఉండగా ఆమె కూడా కాంగ్రెస్‌కే మద్దతు తెలుపుతున్నారు. తాజాగా 8 మంది కౌన్సిలర్ల రాజీనామాతో కాంగ్రెస్ బలం 18కి చేరనుంది. దీంతో మొత్తం 33మంది కౌన్సిలర్లున్న వనపర్తి మునిసిపల్ పీఠాన్ని కాంగ్రెస్ చేజిక్కించుకోవడం ఖాయంగా కనిపిస్తోంది.

ప్రశాంతంగా ముగిసిన టెన్త్ పరీక్షలు

బోధన్ రూరల్, మార్చి30: బోధన్, సాలూర మండలాలలో పదో తరగతి పరీక్షలు శనివారంతో ప్రశాంతంగా ముగిశాయి. బోధన్, సాలూర మండలాల్లో 2915 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 2909 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని ఆరుగురు విద్యార్థులు గైర్హాజరు అయ్యారని మండల విద్యాశాఖ అధికారి నాగనాథ్ తెలిపారు.పదోతరగతి పరీక్ష కేంద్రాలలో ఎటువంటి మాస్ కాపీయింగ్ జరుగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టామన్నారు, ప్రభుత్వ పాఠశాలలో ఉత్తీర్ణత శాతం అధికంగా వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

కమ్మర్‌పల్లి:ఈనెల 18 నుంచి ప్రారంభమైన పదోతరగతి పరీక్షలు శనివారంతో ముగిసాయి. చివరి రోజు పరీక్ష కేంద్రాల నుంచి విద్యార్థులు ఆనందోత్సవాలతో నృత్యం చేశారు. కమ్మర్‌పల్లి మండలంలో హాసాకొత్తూర్, చౌట్‌పల్లి కోనాసముందర్, కమ్మర్‌పల్లి నాలుగు సెంటర్లుగా మండలంలోని 7 ప్రభుత్వ, 1 కస్తూర్బా, శ్రీవిద్యాసాయి, మిసిమి, విజ్ఞానజ్యోతి,ఉషాజ్యోతి ప్రైవేట్ పాఠశాలకు చెందిన 466 మంది విద్యార్థిని విద్యార్థులు (కోనాసముందర్ సెంటర్లో ఒక విద్యార్థి గైర్‌హాజర్) ప్రతిరోజు సెంటర్లకు హాజరై పరీక్షలు రాసినట్లు,పరీక్ష కేంద్రాలలో పరీక్షలు ప్రశాంతగ సాగాయని మండల విద్యాశాఖ అధికారి ఆంధ్రయ్య తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా ముగియడంతో ఇటు విద్యార్థులు, అటు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సైతం ఊపిరి పీల్చుకున్నాట్లయింది. పరీక్షలు బాగా రాశామని మంచిఫలితాలు సాధిస్తామని విద్యార్థులు ఆశాభావం వ్యక్తం చేశారు

ఎడపల్లి: ఎడపల్లి మండల కేంద్రంలోని రెండు పరీక్ష కేంద్రాలతో పాటు జానకంపేట గ్రామంలో గల పదవ తరగతి పరీక్ష కేంద్రాలలో నిర్వహించిన పదవ తరగతి పరీక్షలు శనివారంతో ప్రశాంతంగా ముగిశాయి. మండలంలోని మూడు కేంద్రాలలో 379 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 379 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని ఒక్కరు కూడా గైర్హాజరు కాలుదని మండల విద్యాశాఖ అధికారి రామారావు తెలిపారు. పదవ తరగతి పరీక్ష కేంద్రాలలో ఎటువంటి మాస్ కాపీయింగ్ జరుగకుండా పకడ్బందీ



పరీక్షలు రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

చర్యలు చేపట్టామన్నారు, ప్రభుత్వ పాఠశాలలో గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం ఉత్తీర్ణత శాతం అధికంగా వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

పెర్కిట్: ఈనెల 18న ప్రారంభమైన, పదవ తరగతి పరీక్షలు శనివారంతో ముగిశాయి. ఆర్మూర్ మండలంలోని 14 కేంద్రాలలో నిర్వహించిన పరీక్షలు ప్రశాంతంగా జరిగాయనిఎంఈవో రాజగంగారాం తెలిపారు.1893విద్యార్థులకు గాను నలుగురు విద్యార్థులు గైర్హాజరు కాగా1989 విద్యార్థులు పరీక్షలు రాసినట్టు ఆయన తెలిపారు.

రుద్రూరు: రుద్రూరు మండలంలోని రెండు పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన టెన్త్ పరీక్షలు శనివారం ప్రశాంతంగా ముగిసాయి. పరీక్షలు ప్రశాంతంగా ముగియడంతో పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులు ఆనందంతో సందడి చేశారు. శనివారం నిర్వహించిన పరీక్షకు 372 మందికి గాను ఒకరు గైర్హాజరయ్యారు.

ముప్కాల్: ఈనెల 18న ప్రారంభమైన పదవ తరగతి పరీక్షలు శనివారం ప్రశాంతంగా ముగిశాయి. ముప్కాల్, బాల్కొండ, మెండోర ఉమ్మడి మండలాల్లో ఒక్కరు మినహా విద్యార్థులందరు పదవ తరగతి పరీక్షలకు హాజరయ్యారు.

ఆలూర్‌లో సజ్జ పంట పరిశీలన

ఆర్మూర్‌రూరల్, మార్చి30: వ్యవసాయ శాఖ అధికారులు, కృషి విజ్ఞాన కేంద్రం రుద్రూర్ శాస్త్రవేత్తలు శనివారం ఆలూర్ మండల కేంద్రంలోని సజ్జ పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి వాజిద్‌హుస్సేన్ మాట్లాడుతూ సజ్జ పంటలో కత్తెరు పురుగు సోకి తెగులు ఉధృతంగా ఉన్నందున నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. సజ్జ పంట 40నుంచి 50రోజుల దశలో ఉన్నట్టు గుర్తించారు. వేడి వాతావరణంలో పురుగు యొక్క వివిధ దశల్లో గుడ్లు, లద్దె పురుగు, రెక్కల పురుగు ముగించుకొని విచ్చలవిడిగా పంటను నష్టపరుస్తుందని అన్నారు. రైతులు విత్తనం విత్తుకునే ముందు కిలో విత్తనాలకు ఆరు మిల్లీమీటర్ల సాయంత్రనిలిప్రోల్ మందును తయోమితిక్సన్‌తో కలిపి విత్తనశుద్ధి చేసుకోవాలని సూచించారు. పంటలో బాగా ఎదిగిన లార్వలను గమనించినట్లయితే పది కిలోల తౌడు, రెండు కిలోల బెల్లంను, రెండు లీటర్ల నీటిలో కరిగించి 12నుంచి 14గంటలు పులియబెట్టాలని, పంట వేసే సమయానికి అర గంట ముందు మిశ్రామానికి వంద గ్రాముల పొడి థయోమెతిక్సిన్ మందుతో కలిసి ఉండాలుగా తయారు చేసుకున్న విషపు ఎరలను సాయంత్రం వేలలో మొక్క సుడులలో వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం రుద్రూర్ శాస్త్రవేత్తవిజయ్‌కుమార్, ఏడీఏ,ఏఈవో, రైతులు పాల్గొన్నారు.

ముప్కాల్:మండలంలో కత్తెర పురుగు సోకిన సజ్జ పంట పొలాలను వ్యవసాయాధికారులు కృషి విజ్ఞాన కేంద్రం రుద్రూర్ శాస్త్రవేత్త విజయ్ అన్నారు. శనివారం ముప్కాల్, బాల్కొండ మండలాల్లో వరి పంటలను పరిశీలించారు. వరి, సజ్జ పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సజ్జ పంటలో కత్తెర పురుగు ఉధృతి అధికంగా ఉన్నట్టు ఆయన గమనించి



ఆలూర్‌లో సజ్జ పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి వాజీద్ హుస్సేన్

నట్టు తెలిపారు. వేడి వాతావరణంలో కత్తెర పురుగు, జీవిత చక్రం తొందరగా ముగించుకొని పంటను విచ్చలవిడిగా ఆశించి తీవ్రంగా నష్టపరుస్తుందని తెలిపారు. విత్తనము విత్తుకునే ముందు విత్తన శుద్ధి పాయలో అలాగే ఎకరానికి 8నుంచి పది లింగాకరషక బుట్టలను పంటకు ఒక ఫీట్ ఎత్తున అమర్చుకోవాలని, ఎదిగిన లార్వాలు పంటలో గమనించినట్లయితే విషపు ఏర ఉండలుగా చేసుకొని సాయంత్రం వేళల్లో మొక్క సుడులలో వేసుకోవాలని, విషపు ఎర తయారు చేసుకోవడానికి పది కిలోల తౌడు, రెండు కిలోల నల్ల బెల్లం, తయోమిలాక్సమ్ క్లోరోఫైరీపాస్ ఉపయోగించుకోవాల న్నారు. రసాయ నివారణ చర్యల్లో భాగంగా క్లోరాంత్ర నిలిప్రోల్ 0.4ఎంఎల్ స్పైనారోరం, 0.5ఎంఎల్ తయోమెతక్సీ, లాండాసాహలోత్రిన్ 0.25ఎంఎల్ లీటర్ నీటిని ఏదేని ఒక దానిని 200లీటర్ల నీటిలో కలుపుకొని పిచికారి చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో భీమ్‌గల్ వ్యవసాయ ఏడీఏ మల్లయ్య, మండల వ్యవసాయాధికారి మహేంధర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు

పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

బోధన్ రూరల్, మార్చి30: గ్రామ పంచాయితీ కార్మికులకు రావాల్సిన పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో సాలూర తహసీల్దార్ కార్యాలయం ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు మల్లేష్ మాట్లాడుతూ సాలూర, తగ్గెల్లి, ఖాజాపూర్, హున్స, మందర్న తదితర గ్రామాల్లో పని చేసుతన్న పంచాయితీ కార్మికులకు రావాల్సిన బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. గతంలో సమ్మె చేసిన కాలపు వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్మికులు శంకర్, గంగాధర్, సతీష్, రాములు, రాహుల్, సాయిలు, తదితరులు ఉన్నారు.

తేలికగా ఆంగ్ల బోధనపై దృష్టిసారించాలి

ధర్పల్లి, మార్చి 30: విద్యార్థులకు ఆంగ్ల బోధనపై మక్కువ కనబర్చే విధంగా ఆటపాటల ద్వారా ఆంగ్లాన్ని సులభంగా అర్థమయ్యే విధంగా నేర్పించాలని లిటిల్ హర్ట్స్ పాఠశాల కరస్పాండెంట్ శ్రీకాంత్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోగల పాఠశాలలో ఇల్ ఫెస్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు ఆంగ్ల మధ్యమానికి సంబంధించి అన్ని విషయాలను పాటలు, నాటికలు, నృత్య రూపంలో సులభతరంగా ఏ విధంగా నేర్చుకోవచ్చో వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సాధన, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రారంభమైన ఇందూరు తిరుమల బ్రహ్మోత్సవాలు



ప్రారంభమైన ఇందూరు తిరుమల బ్రహ్మోత్సవాలు

మోపాల్, మార్చి 30: మండలంలోని నర్సింగ్‌పల్లి గ్రామంలోని ఇందూరు తిరుమల తిరుపతి వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం కన్నుల పండుగగా శ్రీశ్రీశ్రీ గంగోత్రి రామానుజ దాసు స్వామి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేయగా బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి.బ్రహ్మోత్సవాలు అంటే అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడు వెంకటేశ్వరస్వామికి చాలా ఇష్టమని లోకకళ్యాణార్థం చేస్తున్న బ్రహ్మోత్సవాలు అంటే స్వామివారికి అత్యంత ప్రీతికరమని గంగోత్రి స్వామి అన్నారు. బ్రహ్మోత్సవాలలో పాల్గొంటే అధిక పుణ్యఫలమని అన్నారు. అదేవిధంగా ఇందూరు తిరుమల బ్రహ్మోత్సవాలు అత్యంత కన్నుల పండుగగా జరగడం ఈ ప్రాంతానికి శుభిక్షం అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సంగీత దర్శకులు, గురువులు రామాచారి, ఆలయ ధర్మకర్తలు నర్సింహారెడ్డి, విజయసింహారెడ్డి, యజ్ఞాచార్యులు శ్రీమన్నారాయణ శిఖామణి, శ్రీఖరాచార్యులు, సంపత్‌కుమార ఆచార్య, రోహిత్ కుమార ఆచార్య, రవీందర్‌యాదవ్, నరాల సుధాకర్, నర్సింహారెడ్డి, భాస్కర్, ప్రసాద్, రమేష్, మురళి, నరేందర్, సురేష్, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి మతిభ్రమించి మాట్లాడుతున్నారు'

భీమ్‌గల్‌రూరల్, మార్చి30: భీమ్‌గల్ పట్టణంలో ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి నిర్వహించిన రైతు ధర్నాలో బీఆర్ఎస్ కార్యకర్తలు తప్ప రైతులు లేరని, 100 రోజుల కాంగ్రెస్ పాలనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న అభివృద్ధిని చూసి బాల్కొండ నియోజక వర్గ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి మతిభ్రమించి మాట్లాడుతున్నారని కాంగ్రెస్‌పార్టీ మండలాధ్యక్షుడు బొదిరెస్వామి అన్నారు. శనివారం భీమ్‌గల్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల విలేకరుల సమావేశం నిర్వహించారు. రైతులకు అన్ని విధాల అండగా కాంగ్రెస్ పార్టీ నిలుస్తుందని, మానిఫేస్టో లో ప్రకటించిన రూ.500ల బోనస్ ను కూడా రైతులకు చెల్లిస్తామని, ప్రశాంత్ రెడ్డి కి అంతగా మదనపడాల్సిన అవసరం లేదని, బిఆర్స్ పాలనలో మంత్రి ప్రశాంత్ రెడ్డి చేపట్టిన చెక్‌డ్యాంలతో రైతులు నట్టేట మునిగిపోయారని, వేల కోట్లు దండుకున్న ప్రశాంత్‌రెడ్డి అతి తొందరలో జైలుకు వెళ్లడం ఖాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి డెలిగేట్ కుంట రమేష్, నర్సయ్య, గోపాల్ నాయక్, అనంతరావ్, నాగేంద్ర, సాయిబాబా, నల్లూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్స్‌డే సందర్భంగా వైద్యులకు సన్మానం

ఎడపల్లి, మార్చి30: జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా శనివారం ఎడపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న వైద్యులు వినీత్, వెంకటేష్‌లను ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది, ఏఎన్ఎం రేఖ కిరణ్ గౌడ్ దంపతులు ఘనంగా సన్మానించారు.ఈసందర్భంగా వారిని శాలువాలతో సన్మానించి పుష్ప గుచ్చం అందజేశారు. అనంతరం వైద్యులు మాట్లాడుతూ వైద్యుల దినోత్సవం సందర్భంగా వారిని సన్మానించినందుకు సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎచ్ఈఓ,ఏఎన్ఎంలు భారతీ,జీవమ్మ,పుష్ప,గంగామణి,లక్ష్మీ,తదితరులు ఉన్నారు.

నిత్యం హనుమాన్ చాలీసా పఠిస్తే సకల శుభాలు

బోధన్ రూరల్, మార్చి30: నిత్యం హనుమాన్ చాలీసా పఠిస్తే సకల శుభాలు కలుగుతాయని హనుమాన్ మాలధారణ చాలా పవిత్రమైనదని వేద పండితులు ప్రవీణ్ మహారాజ్ అన్నారు. శనివారం బోధన్ పట్టణంలోని మారుతి మందిరంలో ఆంజనేయ స్వామికి ప్రత్యేక అలంకరణ చేసి వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతీ రోజు హిందువులు ఆలయ ప్రదక్షిణ చేసి హనుమాన్ చాలీసా, శివ నామస్మరణలు జపిస్తే కోరిన కోరికలు నెరవేరి సకల శుభాలు కలుగుతాయన్నారు.ప్రత్యేక పూజల్లో డాక్టర్ అవినాష్ రెడ్డి భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డికి సన్మానం

ఆర్మూర్‌టౌన్, మార్చి30: మున్సిపల్ పరిధిలోని బైపాస్ రోడ్డులో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డిని శనివారం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. జిల్లా కేంద్రానికి వెళ్తున్న జీవన్‌రెడ్డిని కాంగ్రెస్ నాయకులు ఘనంగా స్వాగతం పలికి పట్టుశాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజ కవర్గ ఇన్ చార్జీ పొద్దుటూరి వినయ్‌కుమార్‌రెడ్డి, ఆలూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముక్కెర విజయ్, సెక్రెటరీ నవనీత్, ఉదయ్, నారాయణ, సంజీవ్, వంశీ, మహేష్, మోతె శీను, ముత్యం, హరిష్, పవన్, చిరంజీవి, గంగాధర్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక..

ఆలూర్ మండల కేంద్రానికి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీలో వినయ్‌రెడ్డి సమక్షంలో చేరారు. మాజీవార్డు మెంబర్‌లు ఉమ్మెడ చిన్న గంగారెడ్డి, గంగారెడ్డి, రాము, హరిష్, కుమ్మరి సంఘం సభ్యులు చిన్నసాయన్న, పెద్ద సాయన్న, ముకేష్‌లతో పాటు 50మంది కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి వినయ్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు.

ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ

మోర్తాడ్, మార్చి30: మండల కేంద్రంలోని ఎన్ఎస్ఎస్ విద్యార్థులు శనివారం ఎయిడ్స్‌పై ర్యాలీ నిర్వహించారు. నేషనల్ హైవే ఎస్సీ, బీసీ కాలనీ పాలెం రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ప్లాస్టిక్ నివారణ కోసం నినాదాలు చేశారు. ఆడ పిల్లల్ని చదివించాలని, పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అంటు నినాదాలు చేశారు. ఈ కార్యక్ర మంలో వైస్‌ప్రిన్సిపాల్ పాషా అతికుల్లా, ప్రోగ్రాం అధికారి భూపతి, దశరథ్, రవీంధర్, సతీష్ కుమార్, సాగర్, మహేష్, ప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఖానాపూర్‌లో వినాయక విగ్రహ ప్రతిష్ఠాపన

నిజామాబాద్ రూరల్, మార్చి 30: జిల్లా కేంద్రంలోని ఒకటవ డివిజన్ పరిధిలోని ఖానాపూర్ విఠలేశ్వర్ నగర్‌లో వినాయక విగ్రహ ప్రతిష్ఠాపన రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్.భూపతిరెడ్డి చేతులమీదుగా నిర్వహించారు. కాలనీకి చెందిన మరాఠా కుటుంబాలు చందాలు వేసుకని వినాయక మందిరం నిర్మించుకున్నారు. శనివారం విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ప్రహారీగోడ నిర్మానానికి ఎమ్మెల్యే నిదుల్లోంచి రూ.5 లక్షలు కేటాయించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యేను కాలనీవాసులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ మాజీ సర్పంచ్ కొర్వ గంగాధర్, కొర్వ కోటయ్య, కొర్వ రాజు, కాలనీవాసులు పవన్, సచిన్, ఉమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కూలీల సంఖ్య పెంచాలి:పీడీ సాయాగౌడ్



నర్సరీని పరిశీలిస్తున్న పీడీ సాయాగౌడ్

ధర్పల్లి, మార్చి 30: ఉపాధి హామీ కూలీల సంఖ్య పెంచాలని డీఆర్‌డీఏ పీడీ సాయాగౌడ్ అధికారులను ఆదేశించారు. శనివారం మండలంలోని ఒన్నాజిపేట గ్రామంలో నర్సరీతో పాటు ఉపాధి హామీ పనులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో కూలీల సంఖ్య 1100 దాటడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని గ్రామాల్లో ఒక్కో గ్రామానికి కేవలం 50 నుంచి 55 మంది మాత్రమే కూలీలు వస్తున్నారని ఈ సంఖ్యను 150కి దాటించాలని ఆయన ఉపాధి హామీ మండల సిబ్బందిని ఆదేశించారు. ఏప్రిల్ మొదటి నుంచి సంఖ్య పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. హరితహారానికి నర్సరీలను సిద్ధం చేయాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో బాలకిషన్, ఎంపీవో వినోద,కార్యదర్శి రఘురాం, ఉపాధి హామీ సిబ్బంది ఉన్నారు.

బీజేపీలో పలువురి చేరిక



కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ అర్వింద్

రెంజల్,మార్చి30: మండలంలోని దూపల్లి గ్రామానికి చెందిన బోయి, రజక కులాల సంఘాల పెద్దలు, 150మంది గ్రామ యువకులు, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన పలువురు నాయకులు శనివారం నిజామాబాద్ పార్టీ కార్యాలయంలో ఎంపీ ధర్మపురి అరవింద్ సమక్షంలో బీజేపీ పార్టీలో చేరారు. వీరికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రధాన మంత్రి మోడీ ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు వారు పేర్కొన్నారు. మూడోసారి నరేంద్ర మోడీ పాలన చూడాలని బీజేపీ పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డీ మోహన్ రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షులు గోపికృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు మేక సంతోష్, వైస్ ఎంపీపీ యోగేష్, ప్రసాద్, రఘుపతి, విజయ్, మహేష్, బక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కలిసిన డిచ్‌పల్లి కాంగ్రెస్ నాయకులు

డిచ్‌పల్లి, మార్చి 30: ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్‌ను శనివారం సాయంత్రం డిచ్‌పల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షులు అమృతాపూర్ గంగాధర్ ఆధ్వర్యంలో కలిసి సన్మానించారు. డిచ్‌పల్లి మండల కార్యాలయానికి హాజరుకావాలని కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు వివిధ పార్టీల నాయకులు స్వచ్ఛందంగా వస్తున్నారని గంగాధర్ మహేష్‌కుమార్‌కు వివరించారు. ఆయన వెంట ధర్మాగౌడ్, వాసుబాబు, నర్సయ్య తదితరులు ఉన్నారు.

డిచ్‌పల్లి ఎంపీపీపై నెగ్గిన అవిశ్వాసం

డిచ్‌పల్లి, మార్చి 30: డిచ్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మధ్యాహ్నం నిజామాబాద్ ఆర్‌డీవో రాజేంద్రకుమార్ ఆధ్వర్యంలో ఎంపీపీ గడ్డెశ్రీనివాస్ అలియాస్ భూమయ్యపై అవిశ్వాస తీర్మానం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎంపీపీపై అవిశ్వాసం ప్రవేశపెట్టిన 13 మంది ఎంపీటీసీలు అవిశ్వాసానికి అనుగుణంగా చేతులు ఎత్తడంతో అవిశ్వాసం నెగ్గినట్లు ఆర్‌డీవో ప్రకటించారు. ఈ సందర్భంగా ఆర్‌డీవో మాట్లాడుతూ జనవరి నెలలో డిచ్‌పల్లి ఎంపీపీ, వైస్ ఎంపీపీలపై అవిశ్వాస తీర్మానం కోరుతూ దరఖాస్తు అందజేశారని జనవరి 29న అవిశ్వాస సమావేశం నిర్వహించాలని నోటీసు ఇచ్చామన్నారు. ఎంపీపీ గడ్డెభూమయ్య హైకోర్టును ఆశ్రయించడంతో కోర్టు స్టే ఉత్తర్వులు జారీ చేయడంతో జనవరి 30న ఎంపీపీపై అవిశ్వాస సమావేశం రద్దు చేసి వైస్ ఎంపీపీపై మాత్రమే అవిశ్వాసం నిర్వహించినట్లు తెలిపారు. మార్చి 13న హైకోర్టు స్టే ఎత్తివేసి ఏప్రిల్ 2లోపు అవిశ్వాస సమావేశం నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసిందన్నారు. దీంతో మార్చి 30న అవిశ్వాస సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. శనివారం అవిశ్వాసానికి అనుగుణంగా 17 మందికి గాను 13 మంది ఎంపీటీసీలు చేతులు పైకి ఎత్తడంతో అవిశ్వాసం నెగ్గిందని ఆర్‌డీవో తెలిపారు. ఈ అవిశ్వాస సమావేశ నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామని గ్రామీణాభివృద్ధి శాఖ, పంచాయతీ రాజ్ శాఖలకు నివేదికలు పంపించి ఆదేశాలు వచ్చిన తర్వాత ఎంపీపీ, వైస్ ఎంపీపీ పదవులకు ఎన్నిక నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా డిచ్‌పల్లి సీఐ మల్లేష్ ఆధ్వర్యంలో డిచ్‌పల్లి, ఇందల్వాయి, జక్రాన్‌పల్లి ఎస్సైలు, సిబ్బందితో భద్రత నిర్వహించారు.



ఎంపీపీ గడ్డెభూమన్నకు వ్యతిరేకంగా చేతులు ఎత్తిన ఎంపీటీసీలు

కాంగ్రెస్ పార్టీని నమ్మే స్థితిలో ప్రజలు లేరు

● వంద రోజుల్లో పథకాలు అమలు చేస్తామని మోసం చేశారు : బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్



సమావేశంలో ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి

భీంగల్ రూరల్, మార్చి 30: కాంగ్రెస్ పార్టీ నేతలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని ఇచ్చిన గ్యారెంటీలను అమలు చేయడంలో విఫలమయ్యారని బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ఆరోపించారు. ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో వేల్పూర్ మండల కేంద్రంలో శనివారం పాదయాత్ర నిర్వహించారు. శ్రీఅభినవ భద్రాచల సీతారామ దేవస్థానంలో ప్రత్యేక పూజలను చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు వంద రోజులైనా అమలు చేయలేదని ఆయన విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీ నేతలు చెప్పే మాటలు నమ్మకుండా అభివృద్ధి చేసిన బీఆర్ఎస్‌కు మద్దతు ఇవ్వాలని ఆయన పిలుపునిచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు ఒకమాట, ఎన్నికలు అయిపోయినప్పుడు మరొక మాట మాట్లాడుతున్నారని ఆయన విమర్శించారు. ఎన్నికల ప్రచారంలో రైతు రుణమాఫీ, రైతుభరోసా అంటూ ప్రచారం చేసి ఇప్పుడు ఢిల్లీ చుట్టూ తిరుగుతున్నారని ఆయన విమర్శించారు. కల్యాణలక్ష్మి పథకంతో పాటు తులం బంగారం ఇస్తానని ప్రచారం చేసి ప్రస్తుతం పట్టించుకోవడం లేదన్నారు. సీఎం సహాయనిధి చెక్కులతో పాటు రైతుబంధు కూడా పూర్తిగా ఇవ్వడం లేదన్నారు. రుణమాఫీ చేయకపోగా ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. ధాన్యంకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తానని చెప్పి ప్రస్తుతం పట్టించుకోవడం లేదని ఆయన విమర్శించారు. తెలంగాణకు బీఆర్ఎస్ పార్టీనే రక్ష అని మాజీ మంత్రి ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ ఎంపీలను గెలిపిస్తేనే అన్ని పథకాలు అమలు అవుతాయని ఆయన అన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలపై మూడు నెలల్లోనే ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందన్నారు. ఇచ్చిన ఏ హామీలను ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. చేయూత మహాలక్ష్మి పథకాలు పట్టించుకోలేదన్నారు. ఎన్నికల్లో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను మాజీ మంత్రి వీడియో ద్వారా ప్రదర్శించారు. కాంగ్రెస్ నేతలు నియోజకవర్గాన్ని పంచుకొని పైరవీలకు తెరలేపారన్నారు. ఎంపీ అర్వింద్ ఏనాడు పార్లమెంట్ పరిధిలో తిరగలేదని ఆయన విమర్శించారు. గ్రామాలకు ఒక్కరూపాయి పనికూడా చేయలేదన్నారు. ఇంట్లో కూర్చొని వీడియోలు చేయడం తప్ప ఆయన చేసింది ఏమీ లేదన్నారు. పసుపు బోర్డు తీసుకువస్తానని చెప్పి ప్రజల్ని మోసం చేశారన్నారు. ఇప్పటి వరకు బోర్డు ప్రకటన చేసిన ఆఫీస్ ఎక్కడ పెట్టారో చెప్పలేదన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటం కోసం బీఆర్ఎస్ ఎంపీలు పార్లమెంట్‌లో ఉండటం అవసరమని రాజ్యసభ సభ్యుడు సురేష్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు తెలంగాణ ఆత్మ లేదన్నారు. పార్టీలు మారేవారు మారుతారని ఆయన అన్నారు. తెలంగాణ కోసం నిక్కచ్చిగా నిలబడాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు, మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్‌తో పాటు పార్టీ నేతలు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కేవోఎస్ టెట్రానిక్ రోబోఫెస్ట్



కాకతీయ టెట్రానిక్ రోబో ఫెస్ట్‌లో పాల్గొన్న విద్యార్థులు

నిజామాబాద్ అర్బన్, మార్చి 30: నగరంలోని కాకతీయ ఒలంపియాడ్ పాఠశాల విద్యార్థులు నిర్వహించిన టెట్రానిక్ రోబోఫెస్ట్ ఆకట్టుకుంది. శనివారం నగరంలోని శ్రీరామగార్డెన్, విజయలక్ష్మి గార్డెన్‌లలో పాఠశాలకు చెందిన 6వ తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థులు 378 ప్రదర్శనలను ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలో నూతన ఆవిష్కరణలతో పాటు ప్రస్తుత ఆధునిక యుగంలో ఏ విధంగా మార్పులు కోరుకుంటున్నారో అందుకు అనుగుణంగా నూతన పరిష్కార మార్గాలను రూపొందిస్తూ విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రదర్శనలు ఆలోచింపజేసే విధంగా సాగాయి. విద్యార్థుల తల్లిదండ్రులు, సందర్శకుల అనుమానాలను నివృత్తి చేస్తూ తాము రూపొందించిన ప్రదర్శనల గురించి విద్యార్థులు వివరించారు. ఈ ప్రదర్శనను జిల్లా ఇంటర్మీడియేట్ విద్యాశాఖ అధికారి రఘురాజ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాకతీయ విద్యాసంస్థల డైరెక్టర్ రజినీకాంత్, రామోజీరావు, రాజా, తేజస్విని, ప్రిన్సిపల్ చంద్రశేఖర్, వైస్ ప్రిన్సిపల్ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాన్వకేషన్ ఫీజు తగ్గించాలని పీడీఎస్‌యూ ధర్నా



ఫీజులు తగ్గించాలని ప్రిన్సిపల్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

డిచ్‌పల్లి, మార్చి 30: తెలంగాణ విశ్వవిద్యాలయంలో కాన్వకేషన్ ఫీజును 700 నుంచి 3500లకు పెంచడం దుర్మార్గమని యూనివర్సిటీలకు నిధులు కేటాయించకుండా సర్టిఫికెట్ల రూపంలో విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేయడం సిగ్గుచేటని పీడీఎస్‌యూ టీయూ కార్యదర్శి జయంతి విమర్శించారు. శనివారం టీయూ పరిపాలన భవనం వద్ద పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జయంతి మాట్లాడుతూ విద్యార్థులు సర్టిఫికెట్లు తీసుకోలేని పరిస్థితి నెలకొందని వీసీ, రిజిస్ట్రార్‌లు పెంచిన ఫీజులను తగ్గించాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీ పరిధిలో చదువుతున్న వేలాది మంది విద్యార్థులు ఫీజులు చెల్లించలేక ఇబ్బందులకు గురవుతున్నారని ప్రభుత్వం ఈ విషయంలో ఆలోచించాలన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు ప్రిన్స్, రవీందర్, అక్షయ్, ఆకాశ్, హన్మాండ్లు, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

● యూనివర్సిటీలో ఇష్టం వచ్చినట్లు ఫీజు పెంపు తగదు

తెలంగాణ విశ్వవిద్యాలయంలో ఇన్‌చార్జి వీసీ, రిజిస్ట్రార్‌లు ఇష్టం వచ్చిన విధంగా ఫీజులు పెంచుతూ విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఎంఎస్ఎఫ్ తెలంగాణ యూనివర్సిటీ అధ్యక్షుడు దినేష్ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రిజిస్ట్రార్ యాదగిరి ఇష్టం వచ్చినట్లు నిర్ణయాలు తీసుకుంటూ కాన్వకేషన్ ఫీజును పెంపుచేశారన్నారు. ఈ విషయంలో ఆందోళన కార్యక్రమాలకు శ్రీకారం చుడతామన్నారు.

● ఫీజులు తగ్గించాలని ప్రిన్సిపల్‌కు వినతి

తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలో పెంచిన కాన్వకేషన్ ఫీజులు తగ్గించాలని కోరుతూ శనివారం గిరిజన శక్తి తెలంగాణ యూనివర్సిటీ అధ్యక్షుడు సీనునాయక్ ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ ఆరతికి వినతిపత్రం అందజేశారు. గతంలో 700 ఉన్న ఫీజును రూ. 3500లకు పెంచడం విద్యార్థులకు భారమన్నారు. పెంచిన ఫీజును తగ్గించాలని విద్యార్థి నాయకులు డిమాండ్ చేశారు.

పాల్దాలో దొంగతనానికి వచ్చిన వ్యక్తిపై దాడి

● చికిత్స పొందుతూ మృతి ● మరో ఐదుగురి పరారీ

నవీపేట,మార్చి30: నిజామాబాద్ మండలం పాల్దాలోని ఓ రైస్ మిల్లులో దొంగతనానికి వచ్చిన వ్యక్తిపై స్థానికులు దాడి చేయగా అందులో ఒక వ్యక్తి మృతి చెందాడు. నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ సతీష్, స్థానికులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పాల్దా గ్రామ శివారులో ఉన్న ఓమూతబడిన రైస్ మిల్లులో శనివారం పాత సామానును ఎత్తుకెళ్లడానికి ఆరుగురు వ్యక్తులు వచ్చారు. రైస్ మిల్లులోకి దొంగతనానికి వచ్చిన వ్యక్తులను స్థానికులు గమనించి వారి వెంట పడగా ఇందులో ఐదుగురు పరారీ కాగా ఒక వ్యక్తి పరుగెడుతూ కింద పడిపోయాడు.వెంటనే అతనిని స్థానికులు పట్టుకుని చితకబాదడంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి.విషయం తెలుసుకున్న నవీపేట పోలీసులు గాయపడిన వ్యక్తిని మొదట నవీపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినప్పటికీ సమయం సాయంత్రం కావడంతో పాటు బాధితుడి పరిస్థితి విషమంగా మారడంతో వెంటనే అతనిని అదే పోలీసు వాహనంలో నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.చికిత్స పొందుతూ సంబంధితవ్యక్తి మృతి చెందాడు.మృతుడు బానోత్ సునీల్ (44)గా గుర్తించడం జరిగిందని సీఐ పేర్కొన్నారు. మృతుడు డిచ్‌పలిలోని సుద్దపల్లి తండాకు చెందిన వ్యక్తిగా భావిస్తున్నారు.పరారీ అయిన మిగత ఐదుగురి కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఇదిలాఉండగా పాల్దా గ్రామంలో శనివారం రాత్రి పోలీసులు ముందు జాగ్రత్తగాపికెటింగ్ ఏర్పాటు చేశారు.దాడికి పాల్పడ్డ అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

తాటిచెట్టుపై నుంచి పడి వ్యక్తి మృతి

ఎడపల్లి,వమార్చి30:ఎడపల్లి మండలంలోని కుర్నాపల్లి గ్రామంలో శనివారం మధ్యాహ్నం తాటిచెట్టుపై నుంచి పడి వ్యక్తి మృతి చెందినట్లు ఎడపల్లి ఎస్సై వంశీ కృష్ణ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మక్కల రాజశేఖర్ (33) అనే వ్యక్తి తాటి ముంజలు కోయడానికి తాటిచెట్టు ఎక్కి ప్రమాదవశాత్తు కింద పడడంతో మరణించాడని, ఆయన భార్య రాజ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

వాటర్ ట్యాంక్ కూల్చివేసిన వ్యక్తిపై కేసు

ఎడపల్లి, మార్చి30: ఎడపల్లి మండలంలోని పోచారం గ్రామంలో ప్రభుత్వ నిధులతో నిర్మించిన మినీ వాటర్ ట్యాంక్‌ను కూల్చి వేసిన సంఘటనలో గ్రామానికి చెందిన సురేష్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎడపల్లి ఎస్సై వంశీ కృష్ణ తెలిపారు. వాటర్ ట్యాంక్ కూల్చివేసిన సంఘటనపై పంచాయితీ కార్యదర్శి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దన్యాప్తు జరుపుతున్నట్లు ఆయన తెలిపారు.

దళారులకు ధాన్యం అమ్మి మోసపోవద్దు

వర్ని,మార్చి30: కష్టపడి పండించిన వరి ధాన్యంను రైతులు దళారులకు విక్రయించి మోసపోద్దని జిల్లా సహకార ఆడిట్ అధికారి పాపయ్య కోరారు. శనివారం వర్నిలో ధాన్యం కొనుగోలు కేంద్రంను ఆయన ప్రారంభించారు. దళారులు జిల్లాలో ఇప్పటికే ధాన్యం కొనుగోళ్లు చేస్తూ ఉడాయించిన సంగతి చూస్తున్నామని ఆయన గుర్తు చేశారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే గిట్టుబాటు ధర లభిస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బోధన్ క్లస్టర్ అధికారి రవీందర్, ఏఈవో అరుణ్ కుమార్, కార్యదర్శి గంగాధర్, శ్రీహరి, నర్సింలు పాల్గొన్నారు.

● దళారులకు చెక్ పెట్టేందుకే కొనుగోలు కేంద్రాలు

ధర్పల్లి: దళారులకు చెక్ పెట్టేందుకే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు పీడీ సాయాగౌడ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఒన్నాజిపేట గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే తమ ధాన్యాన్ని విక్రయించి ప్రభుత్వం మద్దతు ధర పొందాలన్నారు. ఏగ్రేడ్ ధాన్యానికి 2203, బీగ్రేడ్ ధాన్యానికి 2183 ధర చెల్లిస్తోందని ఆయన చెప్పారు. కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలను కల్పించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం సునీత, సిబ్బంది పాల్గొన్నారు.



వర్నిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక



ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు

ఇందల్వాయి, మార్చి 30: ఇందల్వాయి సొసైటీ చైర్మన్ చింతలపల్లి గోవర్ధన్‌రెడ్డితో పాటు సొసైటీ డైరెక్టర్లు, బీఆర్ఎస్ కార్యకర్తలు శనివారం నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే భూపతిరెడ్డి కాంగ్రెస్ పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని రానున్న ఎన్నికల్లో నిజామాబాద్ పార్లమెంట్ స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ పట్ల ఆకర్షితులై రూరల్ నియోజకవర్గంలో ముఖ్యనాయకులు పార్టీలో చేరుతున్నారని తెలిపారు. పార్టీలో చేరిన వారిలో సొసైటీ మాజీ చైర్మన్ మొచ్చ గోపాల్, డైరెక్టర్లు మల్లారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ ముత్తెన్న,రణవీర్,ప్రవీణ్, శ్రీనివాస్, బాల్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

డిచ్‌పల్లి: నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్.భూపతిరెడ్డి సమక్షంలో డిచ్‌పల్లి మండలంలోని ధర్మారం(బి) గ్రామానికి చెందిన వంద మంది బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి పార్టీ కండువాలు వేసి ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ పార్టీ విధానాలు నచ్చకే చాలా మంది కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని పార్టీలో చేరుతున్న వారికి సముచిత స్థానం కల్పిస్తామని అన్నారు. పార్టీలో చేరిన వారిలో సాయిప్రసాద్, సోమనాథ్, రమేష్, బాబా, ఇర్ఫాన్, రమేష్, మైనార్టీ నాయకులు, బీసీ, ఎస్టీ నాయకులు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రతినిధులు అమృతపూర్ గంగాధర్, వాసుబాబు, ధర్మాగౌడ్, శ్యామ్‌సన్, పిచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.

పాత కక్షలతో దాడి చేసిన పది మందిపై కేసు

ఖిల్లా, మార్చి 30 :నగరంలోని నాల్గోటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని బ్యాంకు కాలనీలో పాత కక్షల నేపథ్యంలో వ్యక్తిపై దాడి చేసిన పది మందిపై కేసునమోదు చేసినట్లు ఎస్ఐ.సంజీవ్ తెలిపారు. బ్యాంక్ కాలనీకి చెందిన సిరిగోయ శంకర్ కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అదే కాలనీకి చెందిన మరి కొందరు శంకర్‌పై కక్షలు పెంచుకున్నారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి శంకర్‌పై సుమారు పది మంది దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. స్థానికులు గమనించి ఆయనను చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం శంకర్ చికిత్స పొందుతున్నాడు. బాధితుడి భార్య పోసాని ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గుండారం సొసైటీ త్వరలో ధాన్యం కొనుగోళ్లు

నిజామాబాద్ రూరల్, మార్చి 30: రూరల్ మండలం గుండారం ప్రాథమిక వ్యవసాయ సొసైటీలో త్వరలోనే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామని సొసైటీ చైర్మన్ దాసరి శ్రీధర్ తెలిపారు. శనివారం గుండారం సొసైటీ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సొసైటీ డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ శ్రీధర్ మాట్లాడుతూ.. గుండారం సొసైటీ ఇప్పటివరకు లాభాల్లోనే ఉందన్నారు. జమఖర్చులు చదివి వినిపించారు. కాలూరులో వ్యవసాయ గిడ్డంగి నిర్మాణం కూడా త్వరలోనే పూర్తిచేస్తామని అందుకు అవసరమైన నిధులు రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్.భూపతిరెడ్డి మంజూరుచేస్తారని తెలిపారు. ఖానాపూర్ గిడ్డంగికి మరమ్మత్తులు చేపడతామన్నారు. ఈ సమావేశంలో సొసైటీ డైరెక్టర్లు, రైతులు, కార్యదర్శి అనంతలక్ష్మి, లింగారెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

పెద్దబజార్,మార్చి 30: గౌడ, గీతకార్మికులు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని సంఘం రాష్ట్ర సలహాదారుడు పెద్దివెంకట్రాములు, జిల్లా నాయకులు కోయేడి నర్సింలుగౌడ్ పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని గౌడసంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 2న సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతిని అన్ని మండల, గ్రామాల్లో నిర్వహించాలన్నారు. ప్రభుత్వం వారి వర్ధంతి, జయంతిలను అధికారికంగా నిర్వహించాలని కోరారు. పాపన్న చేసిన సేవలు వీరోచిత పోరాటయోధులుగా తాను పోరాటాలను స్మరించుకుంటూ నివాళులర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సాయాగౌడ్, శ్రీరాంగౌడ్, కిషన్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.





చికెన్ ధరలు

రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.155	రూ.225	రూ. 265
వెన్‌కాబ్(కిలో)	: రూ.160	రూ.235	రూ. 275



బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.67,900	రూ.63,600	రూ.790

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : టిల్లు స్క్వేర్ (10.10, 1.10, 7.50, 10.50)
: ఓం భీమ్ భుష్ (4.40)
స్క్రీన్-2 : గాడ్జిల్లా అండ్ కాంగ్ (3డీ) (తెలుగు) (12.00, 2.40)
: గాడ్జిల్లా అండ్ కాంగ్ (3డీ) (ఇంగ్లీష్) (5.20, 8.00, 10.40)
స్క్రీన్-3 : ది గోట్ లైఫ్ (12.05, 7.00)
: రజాకర్ (3.45)
: ఓం భీమ్ భుష్ (10.40)
స్క్రీన్-4 : క్రూ (హిందీ) (10.45, 1.35, 7.40, 10.30)
: ప్రేమలు (4.25)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : టిల్లు స్క్వేర్ (10.45, 1.40, 4.35, 7.30, 10.25)
స్క్రీన్-2 : గాడ్జిల్లా అండ్ కాంగ్ (10.45, 1.50, 4.25, 10.25)
: ఓం భీమ్ భుష్ (7.30)
స్క్రీన్-3 : ది గోట్ లైఫ్ (1.15, 7.25, 10.40)
: కలియుగ పట్టణంలో (4.30)

దేవి : టిల్లు స్క్వేర్ (11.15, 2.15, 6.15, 9.15)
లలితమహల్ : ఓం భీమ్ భుష్ (11.15, 2.15, 6.15 9.15)
నటరాజ్ : గాడ్జిల్లా అండ్ కాంగ్ (తెలుగు) (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : రజాకర్ (11.15, 2.15, 6.15, 9.15)



- నిజామాబాద్ అర్బన్